

సుందరపుతంగూడెంమధ్య ఎత్తుగా ఉన్న రావిచెట్టు గుడిపెలన్నీ కాలిపోయి నందుకు విచారిస్తున్నట్టు, మెల్లిగా వీచేగాలికి ఆకులు అటూ ఇటూ కొట్టుకుంటున్నాయి! ఇంకా అక్కడా, ఇక్కడా బూడిద గుట్టల్లోంచి కాలిన కంపును వెంటేసుకుని తెల్లటిపొగ ఆ ప్రదేశమంతా తిరుగాడుతూనే ఉంది. రావిచెట్టుకు ప్రక్కనేవున్న గోగులమ్మగుడ శిఖరానికి కింది అంచులో వెక్కులాడిన వాలుగు సిమెంటు సింహాల్ని పెట్టుకుని, పురాతన ప్రదర్శన శాలలోని విపాత విగ్రహంలా నిలబడివుంది! అందులో ఉన్న గోగులమ్మ, వంటికి పూసినరంగు ఎప్పుడో వెలిసి పోగా, ముక్కుపుడకా, మెడలోని గొలుసూ దొంగలు తీసుకుపోగా నేనేం చెయ్యగలిగింది లేదంటూ చేరెడంత కళ్ళతో వెలావెలా పోతుంది! చేతిలోఉన్న కత్తి తుప్పుపట్టి చెదలుతిన్న చెక్క బద్దలా అయి పోయింది. తిరుణాళ్ళల్లో వాడే కత్తులు కాళ్ళ దగ్గర పడి ఉన్నాయి.

గుడిగూళ్ళల్లో ఉన్న పావురాలు మాత్రం రాత్రి రేగిన మంటల్ని నెమరు వేసుకుంటూ, గుడిముందు గుంపుగా జేరిన జనసంపంక కాస్తంత ఆశ్చర్యంగా చూస్తూ మెడల్ని ముందుకూ, వెనక్కూ విచిత్రంగా కదిలిస్తున్నాయి. పొద్దు రెండు బారలు పైకెక్కి పూర్తిగా తెల్లబడిపోయింది.

# సత్యం-శివాలు! సుందరపురం

— బొల్లిముంత నాగేశ్వరరావు

రావిచెట్టు నీడ గుడి ముందరి భాగమంతా పరుచుకుని ఉంది. మెట్ల మీద రాఘవులు బీడీ కాలుస్తూ కూర్చుని ఉన్నాడు. అతని ప్రక్కనే నాగమ్మ, దాని మొగుడు పండుగాడు నిలబడి ఉన్నారు. చుట్టూ జనం కొందరు కూర్చుని, కొందరు నిలబడి ఉన్నారు. వారికి దూరంగా అక్కడక్కడ ఆడవాళ్ళు ఏడ్చే పిల్లల్ని సముదాయిస్తూ మధ్యమధ్యలో తమ దారిద్ర్యాన్ని తిట్టుకుంటూ మసిబారి ఉన్నారు!. మగవాళ్ళ వంటి మీద గుడ్డలు కూడా బూడిద కొట్టుకుని, తడిసి నల్లగా ఉన్నాయి,

జనం మధ్య నిలబడ్డ గోపిగాడు కేకలేస్తూ చెప్తున్నాడు. వాడికళ్ళు ఎర్రగా ఉన్నాయి. జుట్టు చెదిరిపోయి ముఖం మీద పడింది. ఎర్రటి చొక్కా వంటి మీద ఉంది. పంచె మట్టు గోచీ బిగించి మోకాళ్ళపైదాకా కట్టాడు.

"...ఎంత కావరమెక్కకపోతే మాత్తరం పొయ్యి నిప్పు ఆరపకుండా పడుకుంటారా! పండకాడ మొదలయిన ఆ గాలికి పెళ్ళే వూగినయ్యే. ఏరా పండుగా! పెళ్ళాని కామాత్తరం చెప్ప లేకపోయినవ్ రా! గూడేనికి ఎగువన కదరా నీ ఇల్లు—నీ గుడిసెలో లెగిసిన నిప్పు గూడేన్ని మొత్తం కాల్చేగదురా! ఎన్ని గుడిసెలో చూడరా! ఒక్కటీ మిగలకుండా వల్లకాడులా అయినాది. మసి కొట్టుకు మనమంతా దెయ్యాల్లా గుండమూ. పిల్లలు చూడరా—ఆకలాకలంటూ ఏడుత్తుండరు. కట్టరా ఈనట్టమంతా?"

'అడికేటిరా! గాలికెగిస మండదు! పూట పూటకీ పొయ్యి రాజితా దాడికి. పిల్లా జెల్లా. గుర్రాల్లా గుండరు. రాజేసిన పొయ్యి ఆరుపు తారేటి. పొయ్యి రాజవోళ్ళం మనం గనక మన పొయ్యి లెప్పుడూ ఆరిపోయే ఉంటయ్. పూటెడిసి పూట పత్తులు పడిఉంటుం!' ఒకచోట కూర్చున్న వెంకటేసు లేచి అన్నాడు.

'అంతనిర్లచ్చమైతే ఎట్టసేమానా?' రాఘవుల కేసి నంగ డన్నాడు.

అది పొయ్యి ఆరుపుతా దేంటిరా! పొయ్యి ఆరవదు మసల్నే ఆరుపుతాది! ఎంగమ్మా అంది!

ఎవరికితోచినట్టు వాళ్ళు నాగుల్ని, పండుగాని తిట్టటం మొదలెట్టారు.

పండుగాడి కళ్ళల్లో నీళ్ళు కమ్మాయి! నాగులు కాస్తంత బిగ్గరగానే ఏడవటం మొదలెట్టింది.

రాఘవులు నోట్లో బీడీ అయిపోయింది. చివరి దమ్ములాగి కింద పడేశాడు. మెల్లిగా లేచి నిలబడ్డాడు.

'మీరంతా మాట్టాడింది నిజమేరా. మరేంటి సేద్దామంటారు?' అక్కడ నిలబడ్డ జనంకేసి ప్రశ్నించాడు.

'ఏదో ఒక శిచ్చ ఎయ్యాల్సిందే—పూరికే వదిలెత్తే ఇక గూడెంలో గుడిసె పడదు. అంతా కాగర్ల అంటూ నెత్తిన గుడ్డ లేసుకుని ఎటన్నా పోవాల.' గోపిగాడు మరలా అరిచాడు.

'అది కావరాని కొచ్చినాక ఎన్నో పొర్లు పొయ్ రాజేసినాది. ఇన్ని పొర్లు అంటుకోని గుడిసె రాత్తే అంటు కున్నాది. మన కిట్టా అవాల్సి అయినాదిగాని దాని తప్పేటిరా పిచ్చిముఖాల్లారా!' దూరంగా కూర్చున్న ముసలి గరటయ్య అన్నాడు.

"నోరుముయ్యరా ముసలాడా' ఎంగమ్మ పెద్దగా కేక పెట్టింది, గరటయ్య మరలా మాట్లాడలేదు.

రాఘవులు పండుగాడికేసి తిరిగి—

'ఏరా పండుగా! ఏంటి సెప్పుతావ్' అడిగాడు.

'ఏం సెప్పమంటవే' పండుగాడు వెకిలిగా ధ్వనిస్తూ అన్నాడు.

'నీ పెళ్ళాం సేసిన దానికిరా!' వెంకటేసు బిగ్గరగా అరిచాడు.

పండుగాడు కన్నీళ్ళు తడుచు కున్నాడు. రెండడుగులు ముందు కేశాడు.

'నిజమేరా! నా పెళ్ళామే ఈ గూడెం తగలడటానికి కారణమంటుడారు. అందుకు మీాకు తెలిసిందొకటేరా! ఆ నిప్పు నా గుడిసె మీ నుండి గూడెంలోకి దూకినాది గనక. కానీ ఒరేయ్! మీారియ్యన్నీ అడగకముందే ఇంత నట్టానికి కారణమయిన దాన్ని, ముక్కలు ముక్కలు సేసి మీాముందుంచేవోడ్ని. అంతగాలిలో అది పొయ్యి ఆర్పలేదని అంటుండరు. గుర్రాళ్ళా గుండం. నిజమే. పిల్లల్లేరు. గొడ్డుమోతోళ్ళం. కానీ ఒరే! రాత్రి పొయ్యి ఆరపలేదనే అంటుండరుగానీ, పొయ్యి రాజటం ఒరన్నా సూసినార్రా!' ఈ ప్రశ్నతో అక్కడ అంతా ఒక్కసారి గతుక్కు మన్నారు.

'అబద్దం సెప్పి తప్పుకోవాలని సూత్తన్నవురా?' ఎంగమ్మ అంది.

'అబద్దం నోట్లో ఉండా, గోగులమ్మ గుండెల్లో ఉండే. ఆ తల్లి సెమాణకంగా సెపుతుండనే—రాత్రి అదీ, నేనూ పత్తు పడుకున్నామే. కోమటి గురునాథంగారి కొట్లో కాసిన ఏయించిన సెనగలు తెచ్చుకుని, నమిలి నీరు తాగి పడుండమే. ఇంకా నాను సెప్పింది అబద్దమే అనుకుంటే ఆతల్లి పాదాల దగ్గరున్న కత్తి తీసుకు రండిరా. మా ఇద్దరి కడుపు కోసి సూడండిరా. అరగని సెనగ పలుకులు తప్ప అన్నం మెతుకులు కన పడతాయేమో?' మాటలు ముగించి పండుగాడు బోరున ఏడ్చాడు.

అలా ఏడ్చే పండుగాడి నెత్తి మీద చెయ్యి పెట్టి జుట్టు నిమురుతూ రాఘవులు—

"ఏడవకురా పిచ్చ సన్నాసి! సత్తెం సాలాబలంగా ఉంటదిరా. నీ కడుపులో మంచి మంటలా ఐయటి కొచ్చిన ఆ సత్తెం ఇప్పుడు మాకడుపుల్లో మండుతుండదిరా! నీ కడుపుకోసి సూడక్కర్లేదు. పూరుకో" అని జనంకేసి తిరిగాడు!

"ఏరా! ఇన్నారుగా ఇప్పుడు మనం తెలుసుకోవాల్సిన సంగతొకటుంది.

అయితే గూడేనికి నిప్పెలా పడింది?'

ఆ ప్రశ్నతో రాఘవులు కళ్ళు నిప్పుల్లా ఎర్రబడ్డాయి!

కాసేపు అంతా శిలాప్రతిమల్లా నిలుచుండిపోయారు. ఆ మౌనాన్ని చీల్చుకుంటూ నాగులు మాటలు వినిపించాయి. అంతా ఆమె వైపుకి తిరిగారు.

'నాను సెపుతాను. నా ఇంటికి అగ్గి పడ్డ కారణం నాను సెపుతాను కానీ ఈళ్ళందరిలో కాదు. పెద్దోళ్ళు పది మంది గుడి వెనకాలకి రండి' అంది. అంతా ఆశ్చర్య పోయారు.

"అయితే పద—రండిరా' రాఘవులు పదిమందిని పిలిచాడు. అందులో గోపిగాడు, గరటయ్య, ఎంగమ్మ, వెంకటేసు, పండుగాడు, ఇంకా ఐదారు గురు వున్నారు. వారంతా అక్కడి జనానికి కొస్త దూరంగా గుడి వెనుక భాగానికి చేరారు.

## 2

పొద్దు ఎర్రగా క్రిందికి జారుతుంది. పక్షులన్నీ తమతమ గూళ్ళకు చేరు కుంటున్నాయి. ఆల మందలు ఇళ్ళకు చేరుతున్నాయి. పల్లె జనం నీళ్ళ కోసం రేవుకి పోతున్నారు. వీచేగాలిలో ఇంకా వేడి తగ్గ లేదు.

రంగబాబుగారి పసుపు తోటలోని కలుపు పని ముగించి నాగులు ఇంటి ముఖంకేసి వేగంగా నడుస్తుంది.

పసుపు రంగు చీరమీాద ఆకుపచ్చని పూలు ఉన్నాయి. చెమట అరిన తెల్లని రవిక అక్కడక్కడ చిరుగులు పట్టి ఉంది. కుడిచేతిలో చిన్న కొడవలి ఉంది. ఎడంచేతిలో ఎక్కడో సంపాదించు

తాజా వార్తలకు
ఆంధ్రప్రభ
చదవండి

డా॥ పి. వి. కె. రావ్, B.A.



సెక్స్ స్పెషలిస్ట్
(వైద్య విద్యాన్-వైద్యాచార్య)
వివాహము వాయిదా వేయ నవసరము లేదు. దురభ్యాసములవలన కలిగిన నరముల బలహీనత, సుఖవ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా కూడ చికిత్స కలదు ... ...
రావూస్ క్లినిక్,
టి. ... రోడ్, తెనాలి. ఫోన్ 700.

ఉచితం! ఉచితం !!
తెల్లమచ్చలు
అన్ని రకాల మచ్చలను, ఏ రంగు రంగుగు మా ప్రఖ్యాత మందు వల అయిదు రోజులలో మార్చును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచారము నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు:
BHARAT AYURVEDASHRAM,
P.O. Katri Sarai (Gaya)

అంతర్రాతీయ 50 రవ్వల
ఆటోమాటిక్ పిస్టల్
(లైసెన్సు అక్కరలేదు)




గట్టి లోహంతో ఆధునిక సాంకేతిక విధానంతో చెయ్యబడింది. ఇది మిమ్ము వన్య మృగముల, దొంగల బారి నుండి కాపాడును. ఇది మిరుమిట్లు గొలిపే మంటను వెలువరిస్తూ పెద్ద శబ్దం చేయును. వెల: లెదర్‌కేసు, బెల్టు, 200 రవ్వలు (ఉచితం) తో సహా రు. 65—50. అదనపు రవ్వల 100 రు. 5/—లు. పోస్టేజి రు. 8—50. శీఘ్రంగా బట్వాడాకు మీ అడ్రసుతో రు. 8—50 అడ్వాన్సు పంపండి.

GUN MARSHAL (INDIA) (86)
Chhapeti, Aligarh

కున్న లేత గోంగూర మొక్కలు గుప్పెడున్నాయి. ఎండలో అప్పటిదాకా పని చేసిన ముఖం ఎర్ర బారి ఉంది.

దారిలో ఎత్తుగా ఉన్న జమ్మిచెట్టు మీద అప్పటికే చేరిన పక్షులు ఆరాత్రి కునుకు తీసేందుకు చోటు కోసం ఒకదానితో ఒకటి పోట్లాడుకుంటూ అదే పనిగా గోల చేస్తున్నాయి. దాని క్రిందే నిల బడ్డ గూడెం చిన్నగాడు నాగుల్ని చూసి కిలుక్కున నవ్వాడు.

అర్థంకాని నాగులు వాడివంక ఆదోలాచూసింది.

'మాట' వినపడేట్టు అన్నాడు.

ఏం మాటన్నట్టు నాగులు ఒకడుగు ఆగింది. చిన్నగాడు దగ్గరగా వచ్చాడు.

'రంగబాబుగారు ఇయ్యాలనే సూసినాడంట నిన్ను పరీచ్చగా. పని సక్కగా సేత్తవనీ, పని సక్కగున్నట్టే మనిసివి కూడా సక్క గుంటవనీ అన్నాడు.'

'మనిసి సక్కదనం ఆయనకేటిలే, పనిసక్కదనం సూ ... సును. ఇంతకూ ఏంటిది?'

ఏం లేదే. పసుపు తోటల పనైనా దిగదా. దక్షిణం దేవుడి మాన్నేల దగ్గర ఈయన పత్తి నాటాడు. కలుపు పనులు మొదలయ్యాయంట, రేపు ఆడికి రమ్మన్నాడు.'

'సరే వస్తనని సెప్పు.'

నాగులు ఆగకుండా ముందుకు పోయింది. గూడెం చిన్నిగాడు అలాపోయే నాగులు వంక ఆదే పనిగా చూస్తూ నిలుచుండి పోయాడు!

గూడెం చిన్నిగాడు రంగబాబు పనుల్లోనెప్పుడూ ఉంటాడు. కూలీల్ని పిలవటం వాళ్ళచేత పనులు చేయించటం వాళ్ళకు డబ్బులు సర్దటం చేస్తుంటాడు. ఆ గ్రామంలో ఒక విధంగా వాడు రంగబాబుకి అంతరంగికుడుకూడా. వ్యవసాయం విషయంలో చిన్నగాడి సలహా లేనిదే ఆయన ఒక్కడుగూ ముందుకు వెయ్యడు.

చిన్నిగాడు రంగబాబుకి మరింత సన్నిహితు డవ్వటానికి మరో కారణం కూడా ఉంది. అందమైన ఆడవాళ్ళు ఎవరైనా కూలీల్లో కనిపిస్తే వేటాడి అప్పజెపు తుంటాడు.

మనిషి కొవడి బద్దలా వంగి ఉంటాడు. తలకి మించిన జుట్టు కిందికి వేలాడుతూ ఉంటుంది. దూరంగా ఉన్నా చిన్నిగాడ్ని గుర్తు పట్టటం చాలా తేలిక.

రంగబాబు క్కూడా పెద్దగా వయసు ఉండదు. ఆ గ్రామంలో ఎనభై ఎకరాల దాకా పొలంవుంది. ఏభై పోను, మెట్ట మిగతాది. పసు పూ మాగాణి, ప్రత్తి, పొగాకు లాంటి మెట్ట పైర్లు వేస్తుంటాడు.

మనిషి గుండ్రంగా లావుగా ఉంటాడు. ఎప్పుడూ చలాకీగా ఉండటం, సమయస్ఫూర్తిగా మాట్లాడటం ఆయనలోని ప్రత్యేకతలు!

* * *

ఉదయం ఎనిమిది గంటలయ్యింది. జర్మన్ సిల్వర్ టిఫెన్‌లో పచ్చడి మెతుకులు పెట్టుకుని నాగులు దేవుడి మాన్యాల దగ్గరకు వచ్చింది. అక్కడికి కాస్త దూరంలో రంగబాబు మోటార్ పంపు షెడ్డు ఉంది. దానికి అటూ ఇటూ రెండు సపోటా చెట్లు ఏపుగా పెరిగి ఉన్నాయ్. పచ్చని ఆ కుల గుండా కాయలు పత్తుగా కన్పిస్తున్నాయి. కలుపు మనుషులెవరూ ఆ చెట్ల కింద కన్పించడం లేదు.

గూడెం చిన్నిగాడే ఆ షెడ్ దగ్గర తచ్చాట్లాడుతూ కన్పించాడు.

నాగులు మెల్లిగా షెడ్ దగ్గరకు పోయింది. నాగుల్నిచూడగానే చిన్ని గాడి ముఖం విచ్చుకుంది.

'నీకోసమే సూత్తుండా' అన్నాడు.

'మడుసు లింకా రాలేదేంటి?' నాగులు అడిగింది.

'మడుసులుంటే పని గాదుగా' వెకిలిగా నవ్వుతూ అన్నాడు. అదే సమయానికి కాస్తంత దూరంలో నాగులుకి రంగబాబు కన్పించాడు. పరిస్థితి అయోమయంగా తోచింది.

'ఎక్కడ కలుపు తీసేది?' గద్దించినట్టు అడిగింది.

"ఏంటే అట్టా అరుస్తావ్—ఇంకా తెలవలేదేంటి? రంగబాబు సూపు పడ్డ ఆడదాని పని ఎట్టగుంటదో తెలుసా. రొట్టె ఇరిగి నేతిలో పడ్డట్టే. ఇంతదూరం దాకావచ్చి, సల్లకొచ్చిముంతదాయటమెందుగ్గానీ, బాబుగోరికి ఉ అని హాయిగా బతికెయ్' చిన్నిగా డని నిలుచుండి పోయేడు.

"నాసంగతి తెలవదంటరా నీకు' నాగులు పెల్లుబికే కోపాన్ని అణచుకుంటూ అడిగింది.

"ఏంటే సంగతి తెలిసేది! నీదంతా పిచ్చిగానీ—నా నొకటి సెపుతా ఇనుకో—మడిసెప్పుడూ వచ్చ దేనుకునే బువ్వతింటడా—అట్టతింటే ఆడికేం బాగుంటాది. ఇంకా రుసి పడాల్సిన కూర లెన్నుండయ్యే—వంకాయ కూరా, బీరకాయ కూరా, బంగాళా దుంపల కూరా, మాంసవూ—ఇయ్యన్నీ తింటేనే మడిసే అటు సూడవే బాబుగారు. నిగనిగలాడతా సూనెలు తేల తుండడు! అట్టాంటాడాయన గోరి రుసి మరిగివావంటే, అమ్రుతం తిన్నట్టేనే. ఆలోసించుకో బాగా. ఎండలో సెమట లట్టుకుంటూ ఇకమీదట పని సెయ్యక్కర్లేదు. ఇట్టనే వచ్చి కమ్మగా కూలట్టుకు పోదువ్.' చిన్నిగాడు తన మాట నేర్పంతా ప్రదర్శించి సమాధానం కోసం నిలబడ్డాడు.

నాగులు వాడడిగిన తీరుకు కాస్త ఆశ్చర్యపోయి కాస్సేపు అలాగేనిలబడింది. చిన్నిగాడు నాగుల్ని దారిలో పెడుతున్నాడనీ మరి కాస్సేపట్లో,తలుపులు మూసిన పంపు షెడ్‌లో, నాగులు తెరిచిన బాహువుల్లో మధురాను భూతులు ధ్వనిస్తాయనీ మరో ఆడదాన్ని రుచి చూడబోతున్నాననీ రంగబాబు వూహిస్తూ నిలబడ్డాడు.

నాగులు మెల్లిగా చిన్నిగాడి నడిగింది.

'అయితే ఒరే చిన్నిగా! మొగోళ్ళంతా రకరకాల కూరల్లాంటోరన్న మాట! ఇలా అడగమని బాబు గారే నీకు సెప్పిండా?'

"అన్నమాటేందే పిచ్చి ముకమా! అచ్చరాలా అంతే అనుకో" చిన్నిగాడు టపీమని బదులిచ్చాడు. మరలా వెంటనే అన్నాడు.

"ఆడాళ్ళనడిగి మతలబులన్నీ బాబుగారే సెపుతుంటాడు!"

"మడుసుల్ని సూసి ఏ కూరో సెప్పేగలరా?'

"ఓ, నేనే సెప్పే గలను!'

"అయితే నామొగు డే కూరా, బాబుగారే

కూరరా?'

'నీ మొగుడుదేవుండే పిచ్చిముకవూ! ఏపుడు కారం లాంటోడు. ఏడి సెయ్యటం తప్ప ఆది దగ్గి రేటుంది. బాబుగారు సూడవే బంగాళా దుంపల కూరలాంటోరు. బలేరుసిగా ఉంటారు' చిన్నిగాడు సంతోషంగా అని నాగులు ముఖం కేసి చూశాడు.

"అయితే సిన్నిగా! అమ్మగారెప్పుడూ బంగాళా దుంపలకూరేనా తినేది. దుంపకూర వాతంసేసి నడు మట్టు కెల్తాదిరా—అప్పుడప్పుడు ఏపుడు కారం కూడా ఏసుకు తినమను! ఇంటికెళ్ళి అమ్మగారికి సెప్పివత్తా— నాను సువ్వూ కూరలు మార్చు కుందాం—దొరగారు, సిన్నిగాడు వత్తిడి సేత్తుండారని నాగులు చిన్నిగాడి వంక కొరకొరా చూసింది.

'ఏంటి సువ్వనేది?' అర్థంకాని చిన్నిగాడు ఆదోలా ముఖం పెట్టి అడిగాడు.

'ఏంతేందిరా నువ్వు సెప్పిందే కదూ. రుసు లన్నాక అంతా కోరుకుంటరు. అమ్మగారి నోట్లో తాటి మట్టా, నా నోట్లో నాలిక—ఉన్నాయేంటి? అందుకని బాబుగారికి నేను 'ఉ' అంటను. మరి నా మొగుడికి అమ్మగోరిని 'ఉ' అనే సెయ్యమను' నాగులు నోటినుండి ఆ మాటలు వినగానే చిన్నిగాడు ఒక్కసారి అరిచాడు.

'ఏంటే తప్పుడు ముండా! అమ్మగోరు నీ లాంటి పొక ముండనుకున్నావా? గడప దాటి బయటి కొత్తదనుకున్నావా?'

'తూ నీ జిమ్మడ. నోరు ముయ్యరా సచ్చినోడా! గడప దాటినంత మాత్రాన పొకబారు ముండ నయ్యానా నేను. ఒరేయ్! నానూ అమ్మగారి లాంటి ఆడదాన్నేరా. అవిడగోరి మెడలో తాళి బొట్టుండట్టే నా మెడలోకూడా ఉండాదిరా. దూరంగా నిలబడ్డడే ఆ బాబుగోరికి సెప్పరా మా పెట్టెల్లో పైకం లేనంత మాత్రాన మడుసులం పరువు లేకుండా బతకటం లేదని సెప్పరా. కట్టం సేత్తుండాం కాబట్టే కట్టానికి దగ్గ కూలీమను. అంతేకానీ, ఆయ నాడమన్నట్టల్లా ఆడటానికి నా నేం గంగిరెద్దును కానురా' అంటూ గిర్రున వెనుతిరిగి పోటోయిందల్లా మరలా చిన్నిగాడివైపు తిరి

'ఒరేయ్! అమ్మగారంటే నాకు ఏం సెద్ద తలపు లేదురా. ఆమెగోరు పరువు గల తల్లే—నా బోటి పనిచేసేవోళ్ళంటే జాలిగాకూడా ఉంటాది. దొరగా రడగున్న తీరుందే—దొంగ సచ్చినోడా— అందు క్కోసం వచ్చినాదిరా. నా నిట్టా గన్నవని తెలిస్తే రంగబాబుగోరు ఎగిరి పడతరు. మరి నా మొగుడు ఎగిరి పడదురా. అందుకని బాబుగోరి నొకటి గురుతుంచుకోమను. ఎవురి కుండే పరువు ఆరికే ఉంటాది' అంది.

అప్పటివరకూ శిలాప్రతిమలా నిలబడ్డ చిన్నిగాడు 'అయితే సూసుకోవే నీ బతుకు మసి మసి సెయ్యక పోతే నా పేరు సిన్నిగాడే కాదు' అన్నాడు.

'కుక్క అరిసినంత మాత్రాన కొండ లిరగవురా నీ బతుకు సెడ' అంటూ అక్కడ ఆగకుండా నాగులు వరవరా ఇలటి ముఖం పట్టి వెళ్ళిపోయింది.

బిగ్గరగా కేకలు వినిపిస్తుంటే పరిస్థితి బెడిసిం దని రంగబాబు కనిపెట్టాడు. కదలకుండా నిలుచున్న చోటే నిలబడి పోయాడు.

విషయం తెలిసి రంగాబాబు వెర్రెత్తి పోయాడు.

'ఏదో మనిషి బాగుందని ముచ్చట పడితే అంత మాటంటుదా? కూలి ముండకు అంత పొగరా? సరే. రేపు రాత్రికే దాని పని— ముందు దాని గూడు మసి కావాలి. తరవాత దాని సంగతి చూద్దాం' అన్నాడు.

"అట్టనే బాబుగారూ! అగ్గిమంట లెత్తిపోవాల' చిన్నిగాడు పళ్ళు పటపట కొరికాడు.

• • •

'నీ బతుకు మసి సేత్త నన్నాడు. అడే ఈ పని సేసినాడని నా నమ్మకం. అంతకంటే నానే పాపమూ ఎరగనే పెద్దయ్యా' అంటూ నాగులు రాఘవులుకి విషయం వివరించి బోరున ఏడిచింది.

'సెబాస్ గుడిసె కాలిపోతే మళ్ళా తిరిగొత్తది. గూడెం ఆడదాని సీలం కాలిపోతే మళ్ళా రాదు. మంచి పని సేసినావ్.' రాఘవులు అని మళ్ళీ బీడీ ముట్టించాడు. వదిలే పొగ లాగానే ఏవేవో ఊహ లొచ్చి మాయ మవుతున్నాయి. కాస్సేపటికి మరలా అన్నాడు.

'ఏరా గోపిగా! ఇప్పుడు సిచ్చ ఎవురికెయ్యాలా. రంగబాబు కెయ్యగలవా?'

'ఎయ్యగలవే—గూడె మంతా ఒక తాడువీది కొత్తే రంగబాబేంటి ఆడి బాబుక్కూడా సిచ్చెయ్య గలం. ఉండండి. ఆ సిన్నిగోడ్ని జుట్టట్టుకు లాక్కొ త్తను. గోగులమ్మ గుడికాడ సత్తెం పలికిత్తాను. నలుగురులో నిజం సెప్పక పోయిండా నా కొడుకు తలెగిరి పోద్ది. రారా సంగా! లేరా ఎంకటేసూ.' గోపిగాడు ఆవేశంగా లేచాడు.

'ఆదేరా దారి. తీసుకురండి. తరవాత 'కత'నా నడుపుతాను' రాఘవులు అని గభాలున లేచి నిల బడ్డాడు.

**3**

ఎంగమ్మ గోగులమ్మ విగ్రహాన్ని నెత్తిన పెట్టు కుంది, జుట్టు విరబోసుకుని ముఖానికి పసుపు రాసుకుని, చేరెడంత కుంకుమ బొట్టు నొసలంతా పెట్టుకుంది. నాగులు నెత్తిన పూర్ణ కుంభ ముంది. పూర్ణ కుంభానికి పసుపు రాసి కుంకు బొట్టు పెట్టారు. తెల్లని గుడ్డ మూతికి కట్టారు. లోపల నిండే 'పానకంతో' కట్టిన గుడ్డ తడుస్తుంది. చిన్నిగాడి కెక్కడివో రెండు దున్నపోతు కొమ్ములు తల మీద కట్టారు. ముఖానికి నల్లటి రంగు పూశారు. వేప మండలు మెడలో కట్టారు.

ముందు నలుగురు తప్పెట్లు వాయిస్తున్నారు. గోపిగాడు, వెంకటేసు, సంగడు గోగులమ్మ కాళ్ళ దగ్గరున్న కత్తుల్ని తీసుకున్నారు. వెనకటి రాజులు వాడిన కత్తుల్లా అవి బారుగా ఉన్నాయి.

రాఘవులు ముందు నడుస్తున్నాడు.

వెనక ప్రవాహంలా గూడెం జనం—ఎక్కువ మంది చేతుల్లో కత్తులూ, కర్రలూ ఉన్నాయి.

రాఘవులు ఆదేశం మేరకు అంతా కదిలి పోతు న్నారు. అప్పటికే బాగా ఎండెక్కింది. ఎవరూ తిండి తినలేదు. మసి కొట్టుకు మనుషులు నల్లగా, రగిలే కోపంలో కళ్ళు ఎర్రగా, చూడటానికి భయం కలిగిస్తున్నారు.

రాత్రి గూడెం మొత్తంగా కాలిపోవటానికీ,

దీర్ఘ వ్యాధులకు ఉత్తమసిద్ధవైద్యం!



నరముల బలహీనత
ధాతుపుష్టి యవ్వనశక్తి
హెర్నియా చర్మవ్యాధులకు
పోస్టు ద్వారా కూడా కలదు
వరిబీజం (బుడ్డ)
మూత్రవ్యాధులకు
ఆపరేషన్ లేకుండా-రండి
డా॥ దేవర, ఫోన్: 551, తెనాలి.
బ్రాంచి: 26, నార్ బోగ్ రోడ్, మద్రాసు—17

# మంచి పుస్తకాలు

1. జీవితరహస్యాలు:- దివ్యకామసూత్రాలు. రూ. 5
2. యువతి:- దాంపత్యరహస్యాలు. రూ. 5
3. సంతానము:- గర్భనిరోధ మార్గాలు. రూ. 5
4. చేతిపనులు:- సంపాదన మార్గాలు. రూ. 5
5. అద్భుతహాస్యకథలు:- నవ్వటానికి. రూ. 5
6. రసికప్రియకథలు:- శృంగారహాస్యం. రూ. 5
7. మోహస్వప్నఫలితాలు:- స్వప్నాలడిక్షనరీ. రూ. 5
8. మానసికశక్తులు:- అన్ని అన్నివివరాలతో. రూ. 5
9. మంత్రశక్తి:- వివిధసాధనరహస్యాలు. రూ. 5
10. ఐదువైద్యవిధానాలు:- అన్నిరోగాలకువిధమందులు రూ. 16
11. ఆహారవైద్యము:- ప్రకృతిఆహారమార్గాలు. రూ. 10
12. మూలికావైద్యము:- అందరికితెలిసినమొక్కలతో రూ. 10
13. దైవదర్శిని:- బాధలవిముక్తికిదైవరహస్యాలు రూ. 10
14. వ్యవహారదర్శిని:- నిత్యవ్యవహారవిధానబోధిని. రూ. 10

రూ. 20. ఆపైవిలువ ఆర్డర్లకు వి.పి.పోస్టుఖర్చులేకుండా అంతకన్నాతక్కువ ఆర్డర్లకు పోస్టేజి రూ. 4 అదనం
దేశసేవ ప్రచురణలు
5/3 ఆర్.టి. పంజాగుట్టకాలనీ, హైదరాబాదు-4



నెవిక్
వ్యానిషింగ్ క్రీమ్



# ఆమె జాడలు

ఆమె ముఖ ప్రభావము
కాన్పించకపోయినా
సౌందర్య సౌరభాలు
దశ దిశల ప్రసరిస్తున్నాయి.

ఆమె ముఖ గగనాన
స్మితము రెక్కలు విప్పి ఎగిరింది
వదలి అధర కులాయమును

చీకట్లు ముదిరిన రేయి
పిట్టల జంట కూసింది
నిశ్శబ్దపు వృక్షాన్ని
ముద్దిడినట్లు ఉండింది

జ్యోత్స్నా విపిన నిశీథము
వావలి కేక వేసింది
ధవళ ప్రేమ లేఖపై
చేవ్రాలు చేసినట్లుండింది

వర్షము పోతూ పోతూ
నాచు అక్కరాలతో
గోడల మీద వంతకాలు
చేసి వెడలింది.

నేను చీకటి బాటసారిని
ఆమె స్మరణ సువర్ణ చేలాంచలమును పట్టి
జీవిత ప్రయాణాన్ని సాగిస్తున్నాను.

ఆమె ఎలప్రాయపు తోటకు
ఆమని ఆలస్యంగా వచ్చింది
చిగురులు పువ్వులు కోయిల కూతలు
మెండుగానే వెలశాయి.

వృద్ధ వసంతానికి
తరుణ పల్లవ అరుణిమ వలె
స్వాగతం చెప్పి
వసంతాలు ఆడినాయి.

చిగురు టాకులకు
చిరు మొగ్గలకే కాదు
ఆమని పండుగలు.
ముదిరిన ఆకులు పండిన పువ్వులు
ఆ ఉత్సవానికి భాగస్వాములే.

యౌవన వాంఛా సంచయాలను
భుజాన వేసుకొని
వృద్ధాప్యపు ప్రయాణాన్ని
నెమ్మదిగా సాగిస్తున్నాను.

-బెజవాడ గోపాలరెడ్డి

పగలు చీరిలా బయలు దేరటానికీ సంబంధం అక్కడి వారి కెవ్వరికీ బోధ పడలేదు.

తప్పెట్లలో, కేకలతో, చిందులతో, శివాళ్ళతో, ఉద్వేగంతో, ఉద్రేకంతో మసిమసిగా కసికసిగా గూడెం జనం మొత్తం రంగబాబు ఇంటి ముందు ఆగారు. కంగారు తిన్న రంగబాబు విలువు గడ్డేసుకుని వారిని చూస్తూ కాస్సేపు అలాగే నిలుచుండి పోయాడు.

వూరిలోని జనం అక్కడ గుంపుగా పోగయ్యారు.

గొంతు సవరించుకున్న రంగబాబు.

"గూడెం తగలడిందని విన్నాను. ఈ గోగులమ్మ తిరులేమిటా్రా?" రాఘవుల్ని ఉద్దేశించి అడిగాడు.

దున్న వేషంలో ఉన్న చిన్నిగాడ్ని రాఘవులు టపీమని ముందుకు నెట్టాడు. వాడు బోర్లాగా పడి భూమికి కరుసుకు పోయాడు.

గోపిగాడు వాడి వీపు మీద కత్తి మొన ఆనించి పళ్ళు పటపట కొరికాడు!

ఎంగమ్మ వాడి మెడమీద కాలు పెట్టి వికటాట్ట హాసంచేసింది. తప్పెట్లు చెవులదిరేట్టు మ్రోగాయి.

రంగబాబు బెదిరిపోయి—

'ఏమిట్రా ఇది— ఏమిటి?' అంటూ పెద్దగా అరిచాడు.

"నాను సెపుతాను ఇనుకోండి దొరా— ఈడు గూడెం సిన్నిగాడు." రాఘవులు చెప్పటం మొదలెట్టాడు. ఎక్కడికక్కడ నిశ్శబ్దం ఆవరించింది. మూల్గుతూ ఏడ్చే చిన్నిగాడి ధ్వనులు తప్ప మరేం వినిపించటం లేదు.

"గాను పోతురాజుకి భక్తుడు. గడ్డికూడా తింటాడు. అది సంగతట్టగుంచండి. గరగర పొదు ఎర్రగా పొడిసే ఏళ, గూళ్ళ నుండి పచ్చులు బయటికెళ్లే ఏళ గాలివాలుగా ఈస్తుండే ఏళ, గుమ్మటాల్లా తామర పూవులు గుంటల్లో ఇచ్చుకునే ఏళ, గూడెం లగలడి పొగ మబ్బుల్లో పరుసుకుండ ఏళ— గోగులమ్మ గుడిలోంచి బయటి కొచ్చినాది సామీ! గూడెం తగలడటానికి కారణం సెప్పినాది. వంటి దాహం తీరని పోతురాజు నెత్తిమీద పానకం పొయ్యమన్నాది—'

రాఘవులనగానే నాగులు పానకం బిందె దించుకుంది. దాని మూతికి కట్టిన గుడ్డను వూడదీసింది. పానకం ధారగా చిన్నిగాడి వంటిమీద పోసింది. ఒక్కసారి తప్పెట్లుమరలా ఆ ప్రదేశమంతా అదిరిపోయేట్టు మ్రోగాయి!

గోపిగాడు కత్తి తిప్పుతూ, శివాలు తొక్కుతూ అరిచాడు—

'ఇనుకోండి బాబుగారూ— నానూ సెపుతున్నా. ఎదవల్లా బతకొద్దంది గోగులమ్మ. ఊరుల్లా సావమంది గోగులమ్మ. కలబడమంది. తలపడమంది. తాడో పేడో తేల్చుకోమంది."

రంగ బాబుకి ముచ్చెమటలు పట్టాయి! అక్కడ కూడిన గ్రామం జనానికిదేం అర్థం కాలేదు. రాఘవులు మరలా అన్నాడు.

'గూడెం మొత్తం ఒకటే తాడుమీదికొచ్చినాది. ఆటూ ఇటూ బతికే ఎదవలకి అగ్గి పెట్టేసినాది దొరా. అందరి గుడిసెలూ కాలుస్తుండరా. మీరంతా ఒకటేరా అంది. ఇసయం తెలిసిన పోతురాజు ఇనుకున్నాడే వుంది. బరితెగించినోళ్ళం— బతుకుంటే బెమలు

ఒకసారి చూచి రాసిన దానికన్నా రెండుసార్లు చదివింది ఎక్కువ జ్ఞాపకం ఉంటుంది.

— ]

పోయినోళ్ళం— కత్తులు పదునెడతాం. గూడెం కాల్చినోడి నెత్తికి పెడతాం. నెత్తురుకారుత్తాం— నత్తెం కోసం శివాలెత్తుతాం.'

రంగబాబుకి కాళ్ళు తడబడ్డాయి. ఈ సమయంలో ఎలా వ్యవహరించాలో అర్థం కావడంలేదు. చిన్నిగాడు విషయం మొత్తం చెప్పే ఉంటాడు. వాడ్ని అంతా కలిసి చావకొట్టి చెవులు మూసినట్టున్నారు.

తెగించిన జనానికి ఎదురు నిలవటం చాలాఅవివేకం గుడిసెలు కాలి, కడుపులు మాడి జనం ఉద్రేకంలో ఉన్నారు.

మెట్టూ ఉన్న జనానికి విషయం స్పష్టంగా తెలియక ముందే తను తెలివిగా వ్యవహరించాలనుకున్నాడు. అదే విషయాన్ని రాఘవులు పరోక్షంగా హెచ్చరిస్తున్నాడు.

'గ్రామం' పంచాయతీ గొడవల్లో రెండయి వుంది. రెండుగా ఉన్న గూడెం ఒకటై నిలిచింది. వాళ్ళలో ఐక్యత అలాగే నిలబడితే నాస్తానికి తను ఆటలేం సాగవు.

తన పరువు సమస్య, తన బ్రతుకు సమస్య అన్నీ ఇప్పటి తన ఇంగిత పూర్వకమైన ఒకే ఒక్క సమాధానంమీద ఆధారపడి ఉన్నాయి.

రంగబాబు తీవ్రంగా ఆలోచించాడు!

తప్పెట్లు మోగుతున్నాయి. గోగులమ్మ నెత్తుకున్న ఎంగమ్మ వికటంగా నవ్వుతుంది. కత్తులు తీసుకున్న వాళ్ళు శివాలు తొక్కుతున్నారు. రాఘవులు కళ్ళు ఎర్రబడి సమాధానం కోసం ఎదురు చూస్తున్నాయి. గూడెం జనం అర్థం కాకుండా అదోరకంగా అరుస్తున్నారు.

రంగబాబు తన భవంతి మెట్లు దిగి రాఘవులు దగ్గర కొచ్చాడు.

చెయ్యెత్తి నిశ్శబ్దం అన్నట్టు సంజ్ఞ చేశాడు. అంతా నిశ్శబ్దం ఆవహించింది.

"జరిగిందేదో జరిగి పోయింది. ఈసారికి చిన్నిగాడ్ని వదిలేయండి. గుడిసెలు కాలినందుకు నష్ట పరిహారం నేను చెల్లించుకుంటాను. తూర్పునున్న మన తాళ్ళ తోపుల్లో ఎవరికి కావల్సినంత ఆకు వాళ్ళు కొట్టుకొచ్చుకోండి. ప్రభుత్వంచేత కొంత డబ్బు ఇప్పిస్తాను. మరికొంత నే నిస్తాను. ఈ రాత్రి ఫాక్టరీకి పోయి గురవయ్యగారి నడిగి ఇరవై బస్తాలు బియ్యం తెచ్చుకోండి. ఇకమీదట ఇబ్బందేం ఉండదు. కాస్త గోగులమ్మను శాంతించమనండి' టకటకా చెప్పుకు పోయాడు! రాఘవులు చేయివట్టుకు స్నేహ పూర్వకంగా నిమిరాడు! రాఘవులు శాంతించాడు. గూడెం శాంతించింది!

చిన్నిగాడ్ని అక్కడే వదిలేసి తప్పెట్లు మోగించుకుంటూ జనప్రవాహం వెనుదిరిగి పోయింది.

వారివెంటే గురవయ్య ఫాక్టరీ నుండి ఇరవై బస్తా బియ్యమూ రంగబాబు ట్రాక్టరుమీద వాడేనికి చేరాయి. *